www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 2 సంచిక - 45 శుక్రవారం19 ఏప్రిల్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# బీఆర్ఎస్‌కి టచ్‌లో

## 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్

2లో.



104 మంది ఎమ్మెల్యేలున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే బీజేపీ కూల్చే ప్రయత్నాలు చేసిందన్న కేసీఆర్

ఇక 64 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బతకనిస్తుందా? అన్న కేసీఆర్

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలు బాధపడుతున్నారని వ్యాఖ్య

20 మంది ఎమ్మెల్యేలను తీసుకొని రావాలా సర్? అని ఓ నేత అడిగితే ఇప్పుడే వద్దని వారించానన్న కేసీఆర్

# నేటి నుంచి జిల్లాల పర్యటనకు

## సీఎం రేవంత్ రెడ్డి..

**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**

ఉదయం మహబూబ్‌నగర్‌లో వంశీచందర్‌రెడ్డి నామినేషన్‌కు రేవంత్..

సాయంత్రం మహబూబాబాద్ బహిరంగ సభకు హాజరుకానున్న రేవంత్..

20న మెదక్ అభ్యర్థి నీలం మధు నామినేషన్‌కు రేవంత్..

20న సాయంత్రం కర్ణాటక ప్రచారం..

21న భువనగిరిలో చామల కిరణకుమార్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి రేవంత్..

22న ఉదయం ఆదిలాబాద్ సభలో పాల్గొననున్న సీఎం..

23న నాగర్‌కర్నూల్‌లో బహిరంగ సభ..

24న ఉదయం జహీరాబాద్, సాయంత్రం వరంగల్ సభకు రేవంత్.



# తొలి రోజునే పలువురు బిజెపి అభ్యర్థుల నామినేషన్

- మల్కాజిగిరిలో ఈటల
- ముందుగా కట్టమైసమ్మ ఆలయంలో పూజలు
- ర్యాలీగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి
- ఈటల గెలుపు ఖాయమన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- కాంగ్రెస్, బీఆర్ ఎస్ ను చిత్తుగా ఓడించాలి:ఈటల
- మహబూబ్ నగర్ లో డి కె అరుణ
- నాగర్ కర్నూలులో పి రాములు
- మెదక్ లో రఘునందన్
- నల్గొండలో శానంపూడిల నామినేషన్స్

2లో.



# కేసీఆర్ కాళ్ళ దగ్గర ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన వాళ్లా మాట్లాడేది

## జగదీష్ రెడ్డిపైకోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఫైర్

**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**

నల్లగొండ జిల్లా: పదవుల కోసం కేసీఆర్ కాళ్ళ దగ్గర తన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన వాళ్ళా తమ గురించి మాట్లాడేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిపై ఫైర్ అయ్యారు.కోమటిరెడ్డి బ్రదర్స్ పై జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ పదవుల కోసం కోట్లాడే వాళ్లం కాదన్నారు.బీఆర్ఎస్ వాళ్ళు కండువాలు జేబుల్లో పెట్టుకుని తిరుగుతున్నారన్నారు.



మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీని కాదు తనను చూసి ఓటేశారని చెప్పారు.భువనగిరి పార్లమెంట్‌లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు లేవన్నారు. రేవంత్ రెడ్డి చాలా తెలివిగా వ్యహరించారని,శిష్యుడికి టిక్కెట్ ఇచ్చి నాకు ఇన్‌చార్జ్ ఇచ్చిండన్నారు.కేసీఆర్‌కు మొగుడు అంటే రేవంత్ రెడ్డి అని నేను ఒప్పుకుంటున్నా' అంటూ పొగడ్తల వర్షం కురిపించారు.ఏడు నియోజకవర్గాల్లో ఎక్కువ మెజార్టీ కోసం ఇదే నా ఛాలెంజ్ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ మెజారిటీ వచ్చిన నియోజకవర్గానికి వంద కోట్ల నిధులు పక్కా అని స్పష్టం చేశారు

# ఆన్‌లైన్ ద్వారా కూడా నామినేషన్ దాఖలు చేయవచ్చు...

## 24లోగా ప్రింట్ అందించాలి: వికాస్‌రాజ్



**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**

ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నవారు ఆన్‌లైన్ ద్వారా కూడా నామినేషన్ దాఖలు చేయవచ్చునని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను జాగ్రత్తగా నింపాలన్నారు. ఒక్కో అభ్యర్థి మూడు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చునని తెలిపారు. నామినేషన్ వేసేటప్పుడు ఐదు ఫొటోలు ఇవ్వవలసి ఉంటుందన్నారు. ఆన్ లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేసిన వారు ఈ నెల 24వ తేదీలోగా ప్రింట్ తీసుకొని అందించాలని స్పష్టం చేశారు.నాలుగో విడత ఎన్నికలకు తొలిరోజు నామినేషన్ ప్రక్రియ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. మల్కాజ్‌గిరి లోక్ సభ స్థానానికి ఈటల రాజేందర్, మహబూబ్ నగర్ నుంచి డీకే అరుణ, మెదక్ నుంచి రఘునందన్ రావు నామినేషన్లు దాఖలు చేశారు. వీరు ముగ్గురు బీజేపీ అభ్యర్థులు. నాగర్ కర్నూల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి, మెదక్ లోక్ సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

# రాహుల్ ప్రధాని కావడం ఖాయం

- మోదీతో విజయన్ రహస్య ఒప్పందం: సీఎం రేవంత్ రెడ్డి
- కేరళ సీఎం కమ్యూనిస్టు కాదు కమ్యూనలిస్ట్: సీఎం రేవంత్ రెడ్డి
- జూన్ 9న రాహుల్ గాంధీ ప్రధానిగా ప్రమాణం చేస్తారు
- వయనాడ్ పర్యటనలో సీఎం ప్రసంగం



**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధాని మోదీతో కుమ్మక్కై కేరళ ప్రజలనే గాక, సొంత పార్టీ సీపీఎంను కూడా మోసం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తా రు. పినరయి విజయన్, ఆయన కుటుంబసభ్యులు అవినీతిలో కూరుకుపోయారని విమర్శించారు. బంగారం స్మగ్లింగ్‌లో సీఎం, ఆయన కుటుంబసభ్యుల పాత్ర ఉండటం తనకు ఆశ్చర్యాన్ని కలిగించిందన్నా రు. విజయన్‌పై ఈడీ, ఐటీ కేసులున్నప్పటికీ మోదీ చర్యలు తీసుకోవడం లేదని, ప్రధాని మోదీతో కేరళ సీఎం రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పోటీ చేస్తున్న కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానంలో పర్యటిస్తున్న రేవంత్ గురువారం అక్కడ జరిగిన రైతుల సమావేశంలో ప్రసంగించారు.

రాష్ట్రాల ప్రయోజనాలు, రావాల్సిన నిధుల కోసం కేంద్రంతో పోరాటం చేయాలని, ఈ దిశగా తెలంగాణ, కర్ణాటక, జార?ండ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలు నిధుల కోసం పోరాడుతున్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే కేరళ సీఎం విజయన్ మాత్రం కేంద్రంతో పోరాటం చేయకుండా, మతతత్వ బీజేపీతో కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు. పైకి సీపీఎం పార్టీకి చెందిన ముఖ్యమంత్రిగా, కమ్యూనిస్టు నాయకుడిగా కనిపిస్తున్న విజయన్ కమ్యూనిస్టు కాదని, కమ్యూనలిస్టు అని వ్యాఖ్యానించారు. వయనాడ్‌లో బీజేపీ అభ్యర్థి సురేంద్రన్‌కు విజయన్ మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. ఈడీ, ఐటీ కేసులున్నన్ని రోజులు సీపీఎం కోసం విజయన్ పని చేయరని దుయ్యబట్టారు.

# తొలి రోజునే పలువురు బిజెపి అభ్యర్థుల నామినేషన్

**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
ఎవరూ ఊహించని రీతిలో అత్యధిక స్థానాల్లో బీజేపీ విజయం సాధించబోతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తాము ఎవరికీ బీ టీం కాదని చెప్పారు. ఈ విషయంలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, మల్కాజిగిరి భాజపా ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నామినేషన్ ర్యాలీ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రాజకీయంగా ఈటల అనేక ఉద్యమాలు చేశారని.. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారని చెప్పారు. మల్కాజిగిరిలో ఆయన్ను గెలిపిద్దామని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఐకమత్యంతో పనిచేయాలని కార్యకర్తలు, నేతలకు పిలుపునిచ్చారు. నామినేషన్ వేసిన తర్వాత డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేయాలని అధిష్ఠానం సూచించిందని.. కేడర్ అంతా ప్రచారంలో పాల్గొనాలన్నారు. ఇప్పటి వరకు దేశానికి ఏం చేశాం.. ఏం చేయబోతున్నామనేది



ప్రజలకు వివరించాలని చెప్పారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక కూడా కీలకమని.. అక్కడ పార్టీ అభ్యర్థి వంశ తిలక్‌ను గెలిపించాలని కోరారు. మల్కాజిగిరిలో ఈటల రాజేందర్ భారీ మెజారిటీతో గెలవబోతున్నారని.. ఈ విషయంలో తనకు పూర్తి విశ్వాసముందన్నారు. కాంగ్రెస్ ఏం చేసినా తమ గెలుపును ఆపలేదని చెప్పారు.

### ఆ పార్టీలకు డిపాజిట్ గల్లంతే : ఈటెల

కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు డిపాజిట్ దక్కకుండా చేయాలని ఈటల ఓటర్లను కోరారు. మేడ్చల్ జిల్లా



కలెక్టరేట్ లో ఆర్ఓ గౌతం పొట్రు కు నేడు తన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఈటల మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ బాటలోనే పయనిస్తున్నారన్నారని విమర్శించారు. ప్రజల నుంచి మోదీకి మంచి స్పందన వస్తుందని, అనేక వర్గాల ప్రజలు, సంఘాలు మరొక సారి మోడీని గెలిపించేందుకు మద్దతు ప్రకటిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ముస్లిం మహిళలు కూడా మోదీకి పెద్ద ఎత్తున మద్దతు ప్రకటిస్తున్నారన్నారు. మోదీ వచ్చిన తర్వాతే దేశానికి ప్రపంచ వ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు పెరిగాయన్నారు.

అంతకుముందు ఈటల తన నామినేషన్ పత్రాలను




ఆయన సతీమణి జమునతో కలిసి శామీర్ పేట్ కట్ట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు వీరేందర్ గౌడ్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శిల్పా రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, సామ రంగారెడ్డి , కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, బాషా, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

### డీకే అరుణ, రఘునందన్ నామినేషన్

తెలంగాణలో లోక్ సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. తొలి రోజు బీజేపీ అభ్యర్థులు రఘునందన్ రావు, డీకే అరుణ లు నామినేషన్ దాఖలు చేశారు. మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థిగా డీకే అరుణ, మెదక్ ఎంపీ అభ్యర్థిగా రఘునందన్ రావు నామినేషన్ వేశారు. ఆలయాల్లో పూజలు చేసిన అనంతరం ర్యాలీగా వెళ్లి ఆయా జిల్లాల కలెక్టరేట్ లలో రిటర్నింగ్ అధికారులకు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. ఇక కరీంనగర్ లోక్ సభ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థి కోట శ్యాం కుమార్, నిజామాబాద్ లోక్ సభ స్థానంలో స్వతంత్ర అభ్యర్థిగా రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు రాపెల్లి సత్య నారాయణలు నామినేషన్ దాఖలు చేశారు.

### నాగర్ కర్నూలు బిజెపి అభ్యర్థి

అలాగే నాగర్ కర్నూల్ లోక్ సభ బీజేపీ అభ్యర్థి పి.రాములు, నల్గొండ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి లు నామినేషన్లు దాఖలు చేశారు. భువనగిరి స్థానానికి ప్రజావాణి పార్టీ అభ్యర్థిగా లింగిడి వెంకటేశ్వర్లు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

## జవహర్ బాల్ మంచ్ వికారాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ గా డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య...

### నియామక పత్రం అందజేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్..

ప్రజావినికిడి,(హైదరాబాద్):ఏప్రిల్ 18,జవహర్ బాల్ మంచ్ వికారాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ గా డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య ను నియమించినట్లు జవహర్ బాల్ మంచ్ జెబిఎం రాష్ట్ర కోఆర్డినేటర్ చెరుకు కిరణ్ కుమార్ తెలిపారు.జవహర్ బాల్ మంచ్ వికారాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ గా డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల విధిగా అందుకున్నారు. అనంతరం కిరణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాలల హక్కులను కాపాడుటకు భారత స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొన్న జాతీయ నాయకుల జీవిత చరిత్రను సమగ్రంగా నేటి బాలలకు అందించటానికి తగిన కృషి చేయాలని కోరారు.పిల్లోడి లక్ష్మయ్య మాట్లాడుతూ,ఈనాటి పిల్లలే రేపటి పౌరులని ఆ పిల్లలు ప్రతి ఒక్కరు చదువుకొని బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత మన అందరిపై ఉన్నది అని లక్ష్మయ్య అన్నారు. ప్రతి ఒక్కరూ పిల్లలని చదివించే ప్రయత్నం చేయాలి చదివించాలి అంటూ నాకు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగానూ నిస్వార్ధంగాను నాకు ఇచ్చిన బాధ్యత నిర్వర్తిస్తానని డాక్టర్ అన్నారు.



# బీఆర్ఎస్‌కి టచ్‌లో 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు : కేసీఆర్

**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
104 మంది ఎమ్మెల్యేలు ఉన్న మన బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే బీజేపీ కూల్చే ప్రయత్నాలు చేసిందని... ఇక 64 మంది ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బతకనిస్తుందా? అని కేసీఆర్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో భవిష్యత్తు బీఆర్ఎస్‌దే అన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపు కూడా మనదే అన్నారు. మనం గట్టిగా పోరాడితే లోక్ సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలు బాధపడుతున్నారన్నారు. అధికారముందని కాంగ్రెస్‌లోకి వెళ్తే ఇక్కడంతా బీజేపీ కథ నడుస్తోందని



ఓ నాయకుడు తనతో వాపోయాడన్నారు. 20 మంది ఎమ్మెల్యేలను తీసుకొని రావాలా సర్? అని ఓ సీనియర్ కీలక నేత తనను సంప్రదించాడన్నారు. కానీ ఇప్పుడే వద్దని తాను వారించినట్లు చెప్పారు. కాంగ్రెస్‌లో టీమ్ వర్క్ లేదని, స్థిరత్వం లేదన్నారు. ఇప్పటి వరకు 8 లోక్ సభ సీట్లలో గెలుస్తామని సర్వేలు చెబుతున్నాయని... మరో మూడు స్థానాల్లో విజయావకాశాలు ఉన్నాయన్నారు. రైతు సమస్యలు అజెండాగా ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. రైతు సమస్యలపై పోస్ట్ కార్డు ఉద్యమం ఉద్ధృతం చేయాలన్నారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో లక్ష పోస్ట్‌కార్డులు రాయాలని... రైతుల కల్లాల కాడికి వెళ్లి రూ.500 బోనస్‌పై ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. ప్రభుత్వ హామీలను కాంగ్రెస్ పార్టీకి గుర్తు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను మనం అనుకూలంగా మార్చుకోవాలన్నారు.

# 106 ఎకరాలు అటవీశాఖదే..

## 39 ఏండ్లకు సుప్రీం తీర్పు

**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
భూపాలపల్లి : జయశంకర్ జిల్లా భూపాలపల్లి పట్టణంలోని కొంపల్లి గ్రామశివారులో సర్వేనెంబర్ 171లో గల 106-34 ఎకరాలు అటవీ శాఖకు చెందినదే అని భూపాలపల్లి డిఎఫ్ఓ వసంత ప్రభన్యూస్‌కు తెలిపారు. ఇట్టి భూమిపై గల కేసులో సుప్రీంకోర్టు (గురువారం) తీర్పును వెలువరించిందన్నారు. సర్వే నెంబర్ 171 కొంపల్లిశివారులో గల అటవీ భూమి పూర్తిగా అటవీశాఖకు చెందుతుంది అని సుప్రీంకోర్టు తన తీర్పులో నిర్ధారించిందన్నారు.

జశ్రీశింవ్రాశ్రీఖఎవతీఖఅఙఎశ్రీం.ఎశీఎ
%ఈ కేసులో ఫిబ్రవరి నెలలో వాదనలు ముగియగా, సుప్రీంకోర్టు గురువారం తీర్పును వెలువరించింది. సర్వేనెంబర్ 171లో గల 106-34 ఎకరాల భూమిపై మహ్మద్ అబ్దుల్ ఖాసిం అనే వ్యక్తి హక్కును కోరుతూ 1985లో వరంగల్ డిస్ట్రిక్ట్ కోర్టులో కేసు వేయడం జరిగిందన్నారు. ఈ కేసులో తీర్పు 1994లో అటవీ శాఖకు అనుకూలంగా వెలువడగా, సదరు వ్యక్తి హైకోర్టులో పిటిషన్ 1994లో వేయడం జరిగిందన్నారు.ఈ అప్పీల్ పిటిషన్ పై 2018లో హైకోర్టు అటవీశాఖకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ తీర్పుపై మహ్మద్ అబ్దుల్ ఖాసిం రివ్యూ పిటిషన్ ను హైకోర్ట్ లో దాఖలు చేయగా మార్చి 2021 లో హైకోర్టు సదరు 106 ఎకరాల అటవీ భూమి మహ్మద్ అబ్దుల్ ఖాసింకు చెందునని తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ తీర్పుపై అటవీశాఖ





మే 2021లో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవు పిటిషన్ ను ఫైల్ చేసింది.

ఫిబ్రవరి 2024 లో ఇట్టి స్పెషల్ లీవ్ పిటిషన్ పై వాదనలు విన్న ఇద్దరు జడ్జిల ధర్మాసనం గురువారం తీర్పును వెలువరించిందని తెలిపారు. ఈ తీర్పులో సదరు 106 ఎకరాల భూమి అటవీశాఖకే చెందునని ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాకుండా పైవేట్ వ్యక్తులకు అనుకూలంగా అఫిడవిట్ లను దాఖలు చేసిన అధికారులపై ఎంక్వయిరీ చేసి చర్యలు తీసుకొనవలసిందిగా ధర్మాసనం రాష్ట్ర ప్రభుతాన్ని కోరింది.

ధర్మాసనం తన తీర్పులో హైకోర్టు తన పరిధిని దాటి వ్యవహరించి, కనీసం తనదిగా నిరూపించుకోలేని వ్యక్తికి, 106 ఎకరాల అటవీ భూమిని గిప్టుగా ఇచ్చిందని పేర్కొంది. ఈ కేసులో అటవీశాఖ తరపున ఐశ్వర్య భాటి, అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా, శ్రావణ్ కుమార్, ఏఓఆర్, మహ్మద్ అబ్దుల్ ఖాసిం తరపున నీరజ్ కిషన్ కేల్, సీనియర్ అడ్వకేట్, ఎల్.నరసింహ రెడ్డి, సీనియర్ అడ్వకేట్ లు వాదించారు.

%ఈ కేసులో సుప్రీంకోర్టులో వాదనలు జరిగే సందర్భంగా అటవీశాఖ అట్టి భూములు అటవీశాఖకే చెందునని వాదించగా, రెవెన్యూ డిపార్ట్మెరట్ మాత్రం అట్టి 106 ఎకరాలపై పైవేటు వ్యక్తికే హక్కులు కలవని అఫిడవిట్ దాఖలు చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వానికి రెండు ప్రభుత్వ శాఖలు విభిన్న వాదనలు వినిపించడంతో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒకే వాదనను దాఖలు చేయవలసిందిగా చీఫ్ సెక్రటరీని గత అక్టోబర్ లో సుప్రీంకోర్టు ఆదేశించింది.

రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ దాఖలు చేసిన అఫిడవిట్ లో సదరు 106 ఎకరాల అటవీ భూమిగా రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడంతో అట్టి వాదనను సుప్రీంకోర్టు తన తీర్పుతో సమర్ధించి 106 ఎకరాల అటవీ భూమిగా గుర్తిస్తూ తీర్పును వెలువరించిందని భూపాలపల్లి డీఎఫ్‌వో వసంత తెలిపారు.



# తెలంగాణకు కేంద్రం పదేళ్లలో రూ.10 లక్షల కోట్లు కేటాయించింది: కిషన్ రెడ్డి

**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూ.10 లక్షల కోట్లు కేటాయించిందని కేంద్రమంత్రి, ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తనపై ఇప్పటి వరకు ఒక్క అవినీతి మచ్చ లేదన్నారు. తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదన్నారు. తాను ఎవరినీ బెదిరించలేదని... ఎవరిపైనా పక్షపాత ధోరణితో వ్యవహరించలేదన్నారు.తనపై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తనపై విమర్శలు చేసిన వారికి ప్రజలు గతంలోనే బుద్ధి చెప్పారన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి అభివృద్ధి కోసం పని చేశానని



భావిస్తేనే ఓటేయాలన్నారు. తనను మళ్లీ గెలిపించి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# నోరు అదుపులో ఉంచుకో

## బట్టలూడదీసి కొడ్తా : జగదీష్ రెడ్డి

**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
నల్లగొండ: తాను నిఖార్సయిన ఉద్యమకారుడినని, ప్రజల కోసం ఎన్నిసార్లైనా జైలుకు పోయే దమ్మున్న నాయకుడినని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. తనను విమర్శించే అర్హత కోమటిరెడ్డి బ్రదర్స్‌కు లేదని చెప్పారు. వారిద్దరికి బ్రోకర్లు అని పేరుందన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన నల్లగొండలో మీడియాతో మాట్లాడారు. అన్నదమ్ముళ్లు ఇద్దరు కలిసి నల్లగొండ జిల్లా అన్నదాతలను మోసం చేశారన్నారు. సాగర్ నీళ్లను ఆంధ్రకు అమ్మి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వద్ద ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. వైఎస్ ఇచ్చిన భిక్షతో బతికినోళ్లు.. కేసీఆర్‌పై అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని.. లేదంటే బట్టలూడదీసి కొడతామంటూ హెచ్చరించారు.

కాంగ్రెస్‌లో ఉంటూ బీజేపీకి ఓటెయ్యాలని చెప్పిన దగాకోర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అని ఫైర్ అయ్యారు. తన చరిత్ర ఏమిటో, కోమటిరెడ్డి బ్రదర్స్ చరిత్ర ఏంటో చర్చ పెడదామా



అంటూ సవాల్ విసిరారు. కోమటిరెడ్డి సోదరులు నల్లగొండ జిల్లాకు పట్టిన శని అని, వారికి సంస్కారం లేదన్నారు. ప్రజల ముందు వారి బండారం బయటపెడతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ముమ్మాటికీ బీజేపీ మనిషేనని, కమలం పార్టీలోకి పోతాడని కాంగ్రెస్ మంత్రులే లీకులు ఇస్తున్నారని చెప్పారు. కేసీఆర్ జోలికి వస్తే తన్ని తరిమేస్తామని హెచ్చరించారు.

# జనప్రభంజనం చూస్తే

## డీకే అరుణమ్మ విజయోత్సవ ర్యాలీలా ఉంది..

**డీకే అరుణమ్మ నామినేషన్ ర్యాలీలో వేలాదిగా పాల్గొన్న ప్రజలు,నాయకులు, కార్యకర్తలు..**
**"నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి" బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షాద్ నగర్ నియోజకవర్గం..**
**మహబూబ్ నగర్ లోక్ సభ అభ్యర్థిగా నామినేషన్ వేసిన శ్రీమతి డీకే అరుణ..**
**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ పార్లమెంటరీ బోర్డు మెంబర్ డా.కే లక్ష్మణ్..**







ప్రజావినికిడి,(మహబూబ్ నగర్):
బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు శ్రీమతి డీకే అరుణ గురువారం రోజు మహబూబ్ నగర్ లోక్ సభ అభ్యర్థిగా నామినేషన్ వేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ పార్లమెంటరీ బోర్డు మెంబర్ డా.కే.లక్ష్మణ్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నాగు రావు నామాజీ,కెవిఎల్ఎన్ రాజు,పద్మజా రెడ్డి, రతంగ పాండు రెడ్డి,రఘునాథ్ రెడ్డి,కొండయ్య,తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### భారీ మెజారిటీ తో డీకే అరుణమ్మ గెలవడం ఖాయం

ఈ సందర్భంగాకార్యక్రమాన్ని ఉద్దేశించి నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,డీకే అరుణమ్మ నామినేషన్ ర్యాలీ లో ప్రజలు,నాయకులు, కార్యకర్తలు యువకులు వేలాదిగా పాల్గొన్నారని, జనప్రభంజనం చూస్తే విజయోత్సవ ర్యాలీలా ఉందని అన్నారు.గత పదేళ్లలో నరేంద్ర మోడీ దేశం లోని పేద ప్రజలకు,రైతులకు సుపరిపాలన అందించారని,దేశం మొత్తం ప్రజలు మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు.
70 ఏళ్లుగా అధికారం లో ఉండి దేశ సంపదను దోచుకున్న కాంగ్రెస్ పార్టీ ని ప్రజలు నమ్మరని అన్నారు. డీకే అరుణమ్మ భారీ మెజారిటీ తో గెలవడం ఖాయమని, మోడీ మరోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేసారు.
ఇందులో భాగంగా షాద్ నగర్ నుండి దేపల్లి అశోక్ గౌడ్, భూపాల చారి, నర్సింహా గౌడ్, పాతపల్లి కృష్ణా రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్యాట అశోక్,వంశీ కృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, మల్చలం మురళి, శ్రీకాంత్ యాదవ్, షాద్నగర్ బిజెపి నాయకులు శేరి విష్ణువర్ధన్ రెడ్డి,హరి భూషణ్,దివిటి వెంకటేష్,రంగన్న గౌడ్ మంగ విజయ్, పుట్నాల సాయి కుమార్,జమ్ముల నరసింహ,కమ్మదనం శ్రీకాంత్ యాదవ్, చింతం సురేష్, సుబ్రహ్మణ్యం,బాగం మధు,తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

---

# 59 జిలెటన్ స్టిక్స్ పేలుడు పదార్థాలు పట్టివేత..

**బూర్గుల వద్ద యాదయ్య అనే వ్యక్తి వద్ద స్వాధీనం..**
**పేలుడు పదార్థాలను పట్టుకున్నట్టు వెల్లడించిన సిఐ ప్రతాప్ లింగం..**

ప్రజావినికిడి,(షాద్ నగర్):
ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు 59 జిలీటన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నట్టు షాద్ నగర్ సిఐ ప్రతాప్ లింగం తెలిపారు. ఏసిపి రంగస్వామి ఆదేశాలతో సిఐ రామ్ రెడ్డి తదితరులు వీటిని పట్టుకున్నట్టు సిఐ ప్రతాప్ లింగం స్పష్టం చేశారు.ఫరూక్ నగర్ మండలం బూర్గుల వద్ద చింతగూడెం గ్రామానికి చెందిన యాదయ్య అనే వ్యక్తి వద్ద 59 జిలటన్ స్టిక్స్ పేలుడు పదార్థాలు గుర్తించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా అతనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.ఎవరైనా సరే పేలుడు పదార్థాలను అక్రమ పద్ధతులతో తమ వద్ద ఉంచుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని దీనికి పది సంవత్సరాల శిక్ష పడుతుంది అని హెచ్చరించారు.గుట్టలు రాళ్లు పగలగొట్టే విషయాల్లో వీటిని అక్రమ పద్ధతులతో కలిగి ఉంటున్నారని తెలిపారు.ఓవైపు ప్రత్యేక పోలీసు బృందాలతో పాటు




తాము కూడా వీటిపై ప్రత్యేక దృష్టి సాధించినట్లు చెప్పారు. ఎవరైనా ఇలాంటి మందు గుండు సామాగ్రి కలిగి ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సిఐ ప్రతాప్ లింగం కోరారు. ఏసిపి రంగస్వామి ఆదేశాలతో తనతో పాటు డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రామ్ రెడ్డి ఈ కేసులో విచారణ జరిపీనట్టు చెప్పారు.



# సౌదీలోని ఫాతిమా సమాధిని నిర్మించండి..



ప్రజావినికిడి, (ముషీరాబాద్):
సౌదీలోని ప్రాఫిట్ మహమ్మద్ కూతురు ఫాతిమా వందేళ్ల సమాధిని డిమోషన్ వర్క్ పేరుతో కూల్చివేశారని హైదారాబాద్ జన్నూల్ బాకీ ఆర్గనైజేషన్ బొప్పర మౌలానా ఫయాజ్ అలీ అన్నారు. ఈ మేరకు హైదరాబాదులో ఇందిరా పార్క్ వద్ద ధర్నాను నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,1926 లో సౌదీలోని ఫాతిమా సమాధిని కట్టడం జరిగిందని దాన్ని నేడు సౌదీ ప్రభుత్వం కూల్చివేసిందని అన్నారు.తిరిగి దాన్ని పున:నిర్మించాలని డిమాండ్ చేశారు.లేదా అక్కడి ప్రభుత్వం తమకు పర్మిషన్ ఇచ్చిన కూడా మేమైనా కట్టుకుంటామని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం తమకు సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

---

# నాటి ప్రజా సంగ్రామ యాత్రలో నేడు తండ్రి బాటలో తనయుడు

**పుట్నాల అంజయ్య కు నివాళులు అర్పించిన బండి సంజయ్** | **పుట్నాల సాయి కుమార్...**

## భారతీయ జనతా పార్టీకి సేవకుడిగా 30 సంవత్సరాలు పనిచేసిన పుట్నల అంజన్న..


ప్రజావినికిడి,(షాద్ నగర్):
అంజన్న అందరికీ దూరమైన పార్టీ కోసం చేసిన సేవలు పార్టీ గుర్తించి బండి సంజయ్ చేసిన పాదయాత్రలో కొత్తపేట గ్రామంలో పుట్నాల అంజన్న కు నివాళులర్పించడం జరిగింది.
తండ్రి ఆశయం కోసం తనయుడు గత ఏడు సంవత్సరాలుగా విద్యార్థి పరిషత్ లో విద్యార్థుల కోసం విద్యార్థి సమస్యల పైన ఎన్నో ఉద్యమాలు చేసిండు.
ఏబివిపి విద్యార్థి పరిషత్ లో బాధ్యతలు వివేకానంద డిగ్రీ కాలేజ్ ప్రెసిడెంట్ గా,కేశంపేట్ మండల కన్వీనర్ గా, షాద్నగర్ టౌన్ సెక్రటరీ గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యునిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా,శంషాబాద్ విభాగం ఎడ్ ఎఫ్ డి కన్వీనర్ గా,బాధ్యతలు నిర్వహించాడు. తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి పుట్నాల సాయికుమార్ కి కండవ కప్పి పార్టీలోకి స్వాగతం పలకడం జరిగింది.ఈ కార్యక్రమంలో నెల్లి శ్రీవర్ధన్,ప్యాట అశోక్ పాల్గొన్నారు.



### యువమోర్చ బలోపేతానికి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

**"పుట్నాల సాయి కుమార్" బీజేవైఎం షాద్ నగర్ అసెంబ్లీ ఇంచార్జి**

నా మీద విశ్వాసంతో నాకు బీజేవైఎం షాద్ నగర్ అసెంబ్లీ ఇంచార్జిగా బాధ్యనిచ్చిన రాష్ట్ర పార్టీకి సాయి కుమార్ ధన్యవాదములు తెలిపారు.
యువమోర్చ బలోపేతం కోసం,పార్టీ అభివృద్ధి కై కట్టుబడి పని చేస్తా అని అన్నారు.వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్ నగర్ పార్లమెంట్ బిజెపి విజయమే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు.
ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గత పదేళ్లలో భారత దేశాన్ని



అభివృద్ధి పథం లో నడిపిస్తున్నారని, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసారని అన్నారు.2047 వరకు అభివృద్ధి చెందిన వికసిత్ భారత్ లో యువత పాత్ర చాలా కీలకమని, యువమోర్చ ను మరింత బలపరుస్తానని అన్నారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా

## పోస్టర్ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



ప్రజావినికిడి,(ఎల్బీనగర్): రాబోయే హనుమాన్ జయంతి పురస్కరించుకుని గురువారం రోజు ఎల్బీనగర్ శాసనసభ్యుడు సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, హనుమాన్ జయంతి సందర్భంగా భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుంది అన్నారు.దానిలో బాగంగా హనుమాన్ జయంతి రోజు అనగా మంగళవారం రోజున సాయంత్రం 04.00 గంటలకు వనస్థలిపురం గురుద్వారా దగ్గర ఉన్న రామాలయం నుండి శోభాయాత్ర ప్రారంభం అయి వనస్థలిపురం పోలీస్ స్టేషన్,రెడ్ ట్యాంక్,ఎన్.జీ.ఓస్. కాలనీ,ఎస్.కె.డి.చౌరస్తా,వైదేహినగర్,సాహెబ్ నగర్ త్రినేత్ర హనుమాన్ దేవాలయం వద్ద ముగుస్తుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు,ఉద్యమకారులు,సీనియర్ నాయకులు,పలు డివిజన్ల తాజా మాజీ అధ్యక్షులు,అధ్యక్షరాళ్లుపలు విభాగాల కమిటీ అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు,పలు విభాగాల తాజా మాజీ కమిటీ ధర్మకర్తలు,మహిళలు,కార్యకర్తలు,పార్టీ అభిమానులు,హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

# మధు యాష్కి ఆధ్వర్యంలో

## వివిధ డివిజన్ ల కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆత్మీయ సమేళనం..






ప్రజావినికిడి,(ఎల్బీనగర్): టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి ఆధ్వర్యంలో వనస్థలిపురం, బి.ఎన్.రెడ్డి నగర్, హస్తినాపురం డివిజన్ల కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆత్మీయ సమేళనం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకులు,డివిజన్ల అధ్యక్షులు,మహిళా నాయకులు,బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి..



ప్రజావినికిడి,(పల్నాడు): పల్నాడు జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల పట్టణంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ పల్నాడు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పల్నాడు జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏసుపోగు యోబు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని కోరారు,పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు బొంత మరియరాణి మాట్లాడుతూ రకరకాల పార్టీల వారు ప్రజల వద్దకు వచ్చి అలివిగాని హామీలు ఇస్తారని వాటిని నమ్మొద్దని వారు ఇచ్చే ఓటుకు నోటును తిరస్కరించాలని కోరారు.ఎవరైతే ప్రజా సంక్షేమం కోసం,ప్రజల కోసం పాటుపడతారో అటువంటి వారిని ఎన్నుకోవాలని సూచించారు.ముందు తరాల భవిష్యత్తు కోసం పనిచేస్తున్న నాయకులను ఎన్నుకోవాలని,ఈ విషయంలో ప్రజలందరూ విజ్ఞతగా ఆలోచించి,రాజ్యాంగం కల్పించిన మన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా నేషనల్ రైట్స్ కౌన్సిల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏసుపోగు యోబు,పల్నాడు జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి షైక్.సైదాభి,ఉపాధ్యక్షురాలు జి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# "హ్యాపీ కిడ్స్ స్కూల్ "లో ఉల్లాసంగా.. ఘనంగా "గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్"..

ముఖ్య అతిథులుగా తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపెట వెంకటేశ్వర్లు గౌడ్ (ఎస్ వి గౌడ్)
ప్రైవేట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పరసా రమేష్..
ప్రతి విద్యార్థికి పట్టాతో పాటూ మెడల్ శ్రీకారం చుట్టిన కరస్పాండెంట్ దుర్గ.. ప్రిన్సిపాల్ ఉమారెడ్డి..





ప్రజావినికిడి,(హైదరాబాద్):
ఏప్రిల్18,ఖమ్మంలోని వరంగల్ క్రాస్ రోడ్లో ఉన్న,"హ్యాపీ కిడ్స్ స్కూల్ "లో "గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్" గురువారం ఉల్లాసంగా ఉత్సాహంగా ఘనంగా జరిగాయి."హ్యాపీ కిడ్స్ స్కూల్"విద్యార్థులు యూకేజీ మరియు 5వ తరగతి ఆపై తరగతులకు వెళ్లే ప్రతి విద్యార్థికి పట్టాతో పాటూ మెడల్ బహుకరించి పాఠశాల యాజమాన్యం నూతన విద్యా ఒరవడికి శ్రీకారం చుట్టింది.ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన హ్యాపీ కిడ్స్ స్కూల్ కరస్పాండెంట్ దుర్గ, ప్రిన్సిపాల్ ఉమారెడ్డి విద్యార్థినీ విద్యార్థులకు నూతన ఉత్తేజాన్ని ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సంపెట వెంకటేశ్వర్లు గౌడ్ (ఎస్ వి గౌడ్)అలాగే తెలంగాణ ప్రైవేట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పరసా రమేష్ విద్యార్థులను, తల్లిదండ్రులను యాజమాన్యాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ,ప్రతి విద్యార్థి ఎదుగుదలకు, ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే బాల్య విద్యా విధానమే సరైనదన్నారు. బాల్యంలోనే సరైన ఫౌండేషన్ లేకుంటే ఉన్నత తరగతులలో వెనకబడి తాను ఎంచుకున్న మార్గం ఏదైతే ఉందో దానీని విద్యార్థులు చేరుకోలేక జీవితంలో పలు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని,కనుక బాల్య దశ నుంచే ప్రతి చిన్నారి పోటీ తత్వాన్ని అలవరుచుకొని ఉన్నత స్థాయిలో ఉన్న గొప్ప మహానీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని బాల బాలికలకు సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా ప్రతి విద్యార్థి పరిశీలించి శ్రద్ధగా విని కృషి,పట్టుదలతో ఇష్టపడి చదివి కన్న తల్లితండ్రుల, గురువుల ఆశలను, ఆశయాలను వమ్ము కాకుండా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి ఒక ఐఎఎస్,ఐపిఎస్ అధికారిగా,డాక్టర్లుగా, ఇంజనీర్లుగా లక్ష్యంతో చదవాలని విద్యార్థులకు పలు సూచనలు చేసి మనసారా ఆశీర్వదించారు. అలాగే ఈ హ్యాపీ కిడ్స్ స్కూల్ యాజమాన్యం, కరస్పాండెంట్ దుర్గా, ప్రిన్సిపాల్ ఉమారెడ్డి ఆధ్వర్యంలో టీచర్స్ అందరూ సమిష్టి కృషితో ఖమ్మంలో ఉన్న మరే ఇతర పెద్ద విద్యా సంస్థకు తీసిపోకుండా చక్కటి మెరుగైన నాణ్యమైన విద్యను అందిస్తూ,ఎన్నో వ్యయప్రయాసలు ఉన్నప్పటికీ వాటిని లెక్క చేయకుండా ఒక చాలెంజ్ గా తీసుకొని, పట్టుదలతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలకు ఆట పాటలతో ప్లేవే మెథడ్స్ తోఎంతో ఓపికతో చిన్నారులకు అద్భుతమైన నాణ్యమైన విద్యతో పాటు "ఆల్ రౌండ్ డెవలప్మెంట్" విద్యా ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నారు. చక్కటి నాణ్యమైన విద్యను అందిస్తున్న యాజమాన్యాన్ని, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ లకు ప్రత్యేక ఎస్ వి గౌడ్,రమేష్ అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని యాజమాన్యాన్ని అభినందించారు.

# పాలమాకుల ముచ్చింతల్ రోడ్డులో నిలిచిన నీటిని తొలగించిన అధికారులు..

- ఫలించిన "చిల్కమర్రి" పోరాటం.. - రాకపోకలకు అనుకూలంగా మారిన రోడ్డు..
- బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్.. - హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు..



నీటితో నిండి ఉన్న దృశ్యం మాట్లాడుతున్న చిల్కమర్రి...



నీటిని తొలగించిన అనంతరం రోడ్డు చూపిస్తున్న చిల్కమర్రి నర్సింహ

ప్రజావినికిడి,(శంషాబాద్):
ఏడు నెలలుగా నీటితో నిండిన పాలమాకుల ముచ్చింతల్ రోడ్డు ను ఇరిగేషన్ శాఖ అధికారులు గురువారం క్లియర్ చేయించారు. శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల ముచ్చింతల్ రోడ్డును కొంతమంది వ్యక్తులు ఆక్రమించి నీటితో నింపి రాకపోకలకు అడ్డుకట్ట వేశారు.ఈ విషయంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు చిల్కమర్రి నర్సింహ ప్రత్యక్ష పోరాటానికి దిగారు.ఎన్నో అవమానాలు, దౌర్జన్యాలు దాడులను ఎదుర్కొంటూ ముందుకు సాగారు.ఈ విషయంపై ఆయన రెవెన్యూ,ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.రోడ్డుపై రాకపోకలు లేకుండా చేయడం కోసం కొంతమంది అదృశ్య శక్తులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.నీటిని పూర్తిగా తొలగించి అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.స్పందించిన రంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ శాఖ డీఈఈ దుద్యానాయక్,ఏఈ మౌనిక ఘటన స్థలాన్ని నాలుగు రోజుల క్రితం పరిశీలించారు.రోడ్డుపై నిలిచిన నీటిని తొలగిస్తామని మీడియాతో మాట్లాడుతూ, అన్నారు.అధికారులు చెప్పిన మాట ప్రకారం నిన్న సాయంత్రం రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించేందుకు అడ్డంగా ఉన్న మట్టి కట్టను జెసిబి తో తీయించారు.దీంతో నిన్న సాయంత్రం నుంచి రోడ్డుపై నిలిచిన నీరు మైసమ్మ చెరువులోకి వెళ్ళింది. రోడ్డు దాదాపు 90% అందు బాటులోకి వచ్చింది.

ఈ సందర్భంగా చిల్కమర్రి నర్సింహ మీడియాతో మాట్లాడుతూ,రోడ్డుపై నిలిపిన నీటి విషయంలో ఇరిగేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నందుకు, సహకరించిన మీడియా ప్రతినిధులు,గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలుతెలిపారు ఎదిరించేవాడు లేకపోతే బెదిరించే వారిదే రాజ్యం అవుతుందని అన్నారు.ఇందులో భాగంగానే 10 రోజులగా వివిధ రూపాలలో చేసిన పోరాటం ఫలితం దక్కిందన్నారు.ఈ మార్గం వినియోగంలోకి వస్తే కారణంగా రెండు గ్రామాల మధ్య సుమారు 12 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. అదృశ్య శక్తులు మైసమ్మ చెరువుతోపాటు రోడ్డును కనుమరుగు చేసి తమకు అనుకూలంగా మార్చుకునే ప్రక్రియలో భాగంగానే ఇదంతా జరిగిందన్నారు.2015 జూన్ 13వ తేదీన బీటి రోడ్డు వేయడానికి అప్పటి ప్రభుత్వం 149 లక్షల రూపాయలు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే రోడ్డు మాత్రం వేయలేదన్నారు. నిధులు దారి మళ్లించి రోడ్డు వేయకుండా కొంతమంది అడ్డుకున్నారని అన్నారు. ఈ రోడ్డుపై రాకపోకలు జరగకుండా అడ్డుకున్న వారు ఎవరో గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిధులు కేటాయించి బీటి పనులు ప్రారంభించాలని కోరారు. రెండు గ్రామాల ప్రజలు ఈ రోడ్డును వినియోగించుకోవాలని కోరారు.చిల్కమర్రి చేసిన పోరాటం ఫలితం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# క్లౌడ్ సీడింగ్ కాకుంటే..
## మరి దుబాయ్ వరదలకు కారణమేంటి..?


**ఆరు విమానాలతో క్లౌడ్ సీడింగ్ చేశారంటూ ప్రచారం**
**ఓవైపు ఉరుములు మెరుపులు ఉంటే క్లౌడ్ సీడింగ్ ఎలా చేస్తామన్న దుబాయ్**
**నేషనల్ సెంటర్ ఫర్ మెటరాలజీ డిప్యూటీ డీజీ వివరణ**

**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
వర్షపు చుక్క కనిపించడమే అరుదైన ఎడారి ప్రాంతం దుబాయ్ లో కుండపోతగా వర్షం కురవడం.. రోడ్లు, కాలనీలు నదులను తలపించేలా మారడం వెనక కారణమేంటనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. క్లౌడ్ సీడింగ్ పేరుతో ప్రకృతితో చెలగాటం ఆడడం వల్లే దుబాయ్ వాసులకు ఈ కష్టం వచ్చిందని నిపుణులు చెబుతుండగా.. సాధారణ రోజుల్లో క్లౌడ్ సీడింగ్ చేయడం నిజమే కానీ ఈ వరదలకు క్లౌడ్ సీడింగ్ కు సంబంధం లేదని యునైటెడ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం స్పష్టం చేసింది.
మేఘాలు ఏర్పడిన తొలిదశలోనే క్లౌడ్ సీడింగ్ సాధ్యమని, ఓవైపు ఉరుములు, మెరుపుల వాతావరణంలో క్లౌడ్ సీడింగ్ ఎలా చేస్తామంటూ ప్రశ్నిస్తోంది. ఈమేరకు యూఏఈలోని నేషనల్ సెంటర్ ఫర్ మెటరాలజీ (ఎన్సీఎం) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అల్ యాజీది ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. దుబాయ్ లో ప్రస్తుత వరదలకు క్లౌడ్ సీడింగ్ కారణం కాదని, మంగళవారం క్లౌడ్ సీడింగ్ ఆపరేషన్ నిర్వహించలేదని స్పష్టం చేశారు.

### మరి వరదలకు కారణమేంటి..

ఏడాదిన్నరలో కురిసే వర్షం ఒక్క రోజులోనే దుబాయ్ ను ముంచెత్తడానికి కారణం ఏంటనేది ప్రస్తుతం మిస్టరీగా మారింది. ఎడారి ప్రాంతం కావడంతో దుబాయ్ లో వర్షాన్ని కృత్రిమంగా కురిపిస్తారు. పక్కనే ఉన్న సముద్రంలో నీటి ఆవిరి కారణంగా ఆకాశంలో ఏర్పడే మేఘాలపైకి విమానాలను పంపి క్లౌడ్ సీడింగ్ చేస్తారు. దీంతో తరచూ దుబాయ్ లో వర్షం కురుస్తుంది. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు కూడా ఇలా కృత్రిమంగా వర్షం కురిపించి వాతావరణం చల్లబడేలా చేస్తున్నారు. ఈ నెల 16 (మంగళవారం)న కూడా అధికారులు క్లౌడ్ సీడింగ్ చేశారని, ఆరు, ఏడు విమానాలను మేఘాల్లోకి పంపించారని ప్రచారం జరుగుతోంది.
దీంతో దుబాయ్ ని కుండపోత వర్షం ముంచెత్తిందని వాతావరణ నిపుణులు ఆరోపించారు. ఈ ప్రచారంపై ఎన్సీఎం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్పందిస్తూ.. అయితే, తాజాగా కురిసిన భారీ వర్షానికి కారణం క్లౌడ్ సీడింగ్ కాదని తేల్చిచెప్పారు. దీంతో క్లౌడ్ సీడింగ్ కాకుంటే దుబాయ్ లో కుండపోత వర్షానికి ఒకే ఒక అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా అరేబియా పెనిన్సులా మీదుగా గల్ఫ్ ఆఫ్ ఒమన్ పై ఏర్పడిన భారీ తుపాను వల్లే దుబాయ్ ని వర్షం ముంచెత్తి ఉంటుందని వివరించారు.








# నెస్లే సెరిలాక్ మోతాదుకు మించి చక్కెర
## శిశువులకు హానికరం అంటూ కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు

**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
న్యూఢిల్లీ : నెస్లేకు చెందిన శిశువుల ఆహారం ప్రమాదకరం అంటూ కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు చేసింది. ప్రజాధరణ పొందిన 'బోర్న్‌వీటా' హెల్త్ డ్రింక్ కాదంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాత ఇప్పుడు నెస్లెపై ప్రభుత్వ నివేదికలు వివాదాస్పదం అయ్యాయి. నెస్లే అభివృద్ధి చెందుతున్న దేశాలలో విక్రయించే బేబీ మిల్క్, సెరెలాక్ వంటి ఆహార ఉత్పత్తులకు చక్కెర, తేనెను జోడిస్తోందని అధ్యయనంలో తేలింది. జ్యూరిచ్‌కు చెందిన పబ్లిక్ ఐ, ఐబిఎఫ్ఎఎన్ (ఇంటర్నేషనల్ బేబీ ఫుడ్ యాక్షన్ నెట్‌వర్క్) తమ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించాయి.నివేదిక ప్రకారం, ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాలో విక్రయించే ఆరు నెలల శిశువులకు సంబంధించిన అన్ని గోధుమ ఆధారిత బేబీ ఫుడ్స్‌లో అత్యధిక చక్కెర ఉన్నట్టు గుర్తించారు. నెస్లె ఉత్పత్తుల్లో సగటున 3 గ్రాముల చక్కెర ఉన్నట్టు కనుగొన్నారు. పబ్లిక్ ఐ ఈ దేశాల్లోని కంపెనీకి చెందిన 150 ఉత్పత్తులను బెల్జియంలోని ల్యాబ్‌లో పరీక్షించింది. పబ్లిక్ ఐ ఈ వాదన నిజమని తేలితే, అది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్ఒ ) సూచనలను ఉల్లంఘించినట్లే అవుతుంది. డబ్లుహెచ్ఒ మార్గదర్శకాల ప్రకారం, 3 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఆహారంలో చక్కెర లేదా తీపి పదార్థాలను ఉపయోగించకూడదు. యూరోపియన్ దేశాల బేబీ ఉత్పత్తులలో చక్కెర లేదు నివేదికల ప్రకారం, బ్రిటన్, జర్మనీ దేశాల్లో ఆరు నెలల చిన్నారుల నెస్లె సెరెలాక్ ఉత్పత్తులకు ఎలాంటి చక్కెరను జోడించలేదు. కానీ భారత్‌లో 15 సెరెలాక్ ఉత్పత్తులకు సగటున 2.7 గ్రాముల చక్కెరను యాడ్ చేసినట్లు గుర్తించారు. నవజాత శిశువుల కోసం విక్రయించే పౌడర్డ్ మిల్క్ నిడోలో ఒక్కో బాటిల్‌లో సగటున 2 గ్రాముల చక్కెర ఉంటుంది. మరోవైపు నెస్లే స్వదేశమైన స్విట్జర్లాండ్‌లో లేదా జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి యూరోపియన్ దేశాలలో విక్రయించే ఉత్పత్తులలో చక్కెర ఉండదు.




### గత 5 ఏళ్లలో చక్కెరను 30% తగ్గించాం: నెస్లే

ఈ అధ్యయనంపై నెస్లే ఇండియా స్పందిస్తూ, భారతదేశంలోని శిశువుల ఆహార ఉత్పత్తుల్లో చక్కెర తగ్గించామని తెలిపింది. బేబీ ఫుడ్స్ అత్యంత నియంత్రిత వర్గంలోకి వస్తాయి. కంపెనీ ఎక్కడ పనిచేసినా స్థానిక చట్టాలు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది. చక్కెరతో సహా కార్బోహైడ్రేట్ల లేబులింగ్, పరిమితిని కూడా కలిగి ఉంటుంది. గత ఐదు సంవత్సరాలలో నెస్లే శిశు ఉత్పత్తుల్లో చక్కెరను 30 శాతం తగ్గించిందని కంపెనీ తెలిపింది.

# ఎన్నికల ప్రచారం కోసం
## మరోసారి ఏపీకి ప్రధాని మోదీ

**4 సభల్లో పాల్గొననున్న ప్రధాని మోదీ...**
**చంద్రబాబు, పవన్ కూడా హాజరు**
**ఒకట్రెండు రోజుల్లో మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారు**

**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కూటమి కట్టిన నేపథ్యంలో, ఇప్పటికే ఓసారి ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ... త్వరలో మరోసారి రాష్ట్రానికి రానున్నారు. ఎన్డీయే కూటమి తరఫున ఏపీలో 4 బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ప్రధాని మోదీ అనకాపల్లి, రాజమండ్రి, కడప లేదా రాజంపేట, మరో ప్రాంతంలో నిర్వహించే సభల్లో పాల్గొననున్నారు. ఈ సభల్లో ప్రధాని మోదీతో పాటు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ కూడా పాల్గొననున్నారు.
ప్రధాని రాష్ట్రానికి వచ్చే లోపు వీలైనన్ని సభలతో ఉమ్మడి ప్రచారం చేయాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ నెల 24న రాయలసీమలో చంద్రబాబు, పవన్ ఉమ్మడి ప్రచారం నిర్వహించనున్నారు. రాజంపేట, రైల్వే కోడూరులో నిర్వహించే ప్రజాగళం, వారాహి విజయభేరి సభల్లో పాల్గొంటారు. రేపు (ఏప్రిల్ 19) ఆలూరు, రాయదుర్గం నియోజకవర్గాల్లో చంద్రబాబు ప్రజాగళం సభలు జరపనున్నారు. ఈ నెల 20న గూడూరు, సర్వేపల్లి, సత్యవేడులో చంద్రబాబు పర్యటించనున్నారు.
దేశంలో నాలుగో విడత ఎన్నికల కోసం నేడు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. నాలుగో విడతలో భాగంగా ఏపీలో మే 13న ఒకే రోజున అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి.



ఏపీలో ఎన్నికలకు కొన్ని వారాల సమయం మాత్రమే ఉండడంతో ప్రచారం ముమ్మరం చేయాలని కూటమి భావిస్తోంది. అందుకే ప్రధాని మోదీని రాష్ట్రానికి రప్పిస్తున్నారు. మోదీ సభల షెడ్యూల్ ఒకట్రెండు రోజుల్లో ఖరారు చేయనున్నారు.

### సీఎం జగన్ పై రాయి దాడి కేసు
# నిందితుడికి 14 రోజుల రిమాండ్



**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
ఈ నెల 13న విజయవాడలో సీఎం జగన్ పై రాయి దాడి జరిగింది. ఈ కేసులో దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. నిందితుడ్ని ఇవాళ విజయవాడ కోర్టులో హాజరుపర్చగా... న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారు. మే 2 వరకు అతడికి రిమాండ్ విధిస్తున్నట్టు విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పేర్కొన్నారు.
కాగా, నిందితుడి పుట్టినతేదీపై కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ఆధార్ కార్డు ప్రకారం అతడు మైనర్ అని నిందితుడి తరఫు న్యాయవాది వాదించారు. అయితే, తాము మున్సిపల్ శాఖ ఇచ్చిన పుట్టినతేదీ ధృవపత్రాన్ని పరిగణనలోకి తీసుకుంటామని కోర్టు స్పష్టం చేసింది.

# వైఎస్ జగన్ ఆస్తుల కేసు: సీబీఐ కోర్టులో మరోసారి విచారణ వాయిదా

**%నాంపల్లి సీబీఐ కోర్టులో సీఎం జగన్ ఆస్తుల కేసుల విచారణ**
**జగన్, ఇతర నిందితుల డిశ్చార్జి పిటిషన్లపై విచారణ**
**తదుపరి విచారణ ఈ నెల 30కి వాయిదా**



**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
ఏపీ ముఖ్యమంత్రి, వైసీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆస్తుల కేసుల విచారణ సుదీర్ఘకాలంగా జరుగుతుండడం తెలిసిందే. నేడు నాంపల్లి సీబీఐ కోర్టులో ఈ కేసుల విచారణ చేపట్టారు. జగన్, ఇతర నిందితుల డిశ్చార్జి పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. సీబీఐ, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై విచారణను సీబీఐ న్యాయస్థానం ఈ నెల 30కి వాయిదా వేసింది.
మరోవైపు, జగన్ ఆస్తుల కేసులో ట్రయల్ నత్తనడకన నడస్తుండడంపై సుప్రీంకోర్టు ఇప్పటికే సీబీఐని ప్రశ్నించింది. రాజకీయ కారణాలతో విచారణలో జాప్యం చేయరాదని, సీఎం అన్న కారణంగానే విచారణ ఆలస్యమవుతోందన్న వాదనకు ఏం జవాబు చెబుతారని సీబీఐని నిలదీసింది. సీఎం అయితే వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఉంటుందా? అని అత్యున్నత న్యాయస్థానం ఇటీవల విచారణలో ప్రశ్నించింది

# బీఆర్ఎస్ గెలిచే మొదటి సీటు సికింద్రాబాద్...
## కిషన్ రెడ్డి భయపడుతున్నారు: కేటీఆర్



**ఏప్రిల్ 18, ప్రజావినికిడి,:**
తెలంగాణలో బీఆర్ఎస్ గెలిచే మొదటి సీటు సికింద్రాబాద్ అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇక్కడి నుంచి పద్మారావు గౌడ్ మన పార్టీ తరఫున పోటీలో ఉండటంతో కిషన్ రెడ్డి ఆలోచనలో పడ్డారని పేర్కొన్నారు. యూసుఫ్‌గూడలో ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీజేపీని ఢీకొట్టే శక్తి కాంగ్రెస్‌కు లేదన్నారు. కిషన్ రెడ్డి కేంద్రమంత్రిగా ఉండి ఏం చేశారని నిలదీశారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలు అమలు చేశారా? అని ప్రశ్నించారు.కేసీఆర్ వెంట నడిచిన సైనికుడు పద్మారావు అని ప్రశంసించారు. పద్మారావును చూసి కిషన్ రెడ్డి భయపడుతున్నారంటే మన గెలుపు ఖరారైనట్లే అన్నారు. బీజేపీ తీరు ఎలా ఉందంటే... మోదీ జేబులో ఉండాలి, లేదంటే జైలులో ఉండాలి అన్నట్లుగా దేశంలో పరిస్థితి మారిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హైదరాబాద్‌లో క్లీన్ స్వీప్ చేసిందని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించింది బీఆర్ఎస్సే అన్నారు. బండి సంజయ్, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, సోయం బాపురావు, ధర్మపురి అర్వింద్‌లను ఓడించింది బీఆర్ఎస్ వారే అన్నారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లోనూ కిషన్ రెడ్డిని ఓడించేది మన పద్మారావే అన్నారు.కరోనా సమయంలో చాలామంది నాయకులు మంచి పనులు చేశారని, సీతాఫల్‌మండిలో పద్మారావు గౌడ్ రెండు రెండున్నర కోట్లు ఖర్చుపెట్టి అన్నదానాలు చేశారని తెలిపారు. కిషన్ రెడ్డి మాత్రం కుర్‌కురే ప్యాకెట్లు పంచాడని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కాళేశ్వరం లిఫ్ట్‌లు ప్రారంభిస్తే.. కిషన్‌రెడ్డి సీతాఫల్‌మండి స్టేషన్‌లో లిఫ్టులు ప్రారంభించారన్నారు. గుడిమల్కాపూర్‌లో సింటెక్స్ ట్యాంకులకు కిషన్ రెడ్డి కొబ్బరికాయలు కొడుతున్నారన్నారు. రాముడు బీజేపీ పార్టీ కాదని... ఆయన అందరివాడు అని స్పష్టం చేశారు. రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదామని పిలుపునిచ్చారు.

# భర్త బ్రేకప్ విషయాన్ని చెప్పిన స్నేహ!

వివాహం తర్వాత స్నేహ సెలక్టివ్ గా సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. అన్ని భాషల్లోనూ ఇదే తరహాలో బ్యాలెన్స్ చేస్తూ వస్తోంది. భర్త..పిల్లలు కుటుంబం అంటూ ఆ జీవితానికే ఎక్కువ ప్రాధన్యత ఇస్తుంది. హీరోయిన్ గా పనిచేసినంత కాలం చేసాను...ఇప్పుడు రిలాక్స్ అవ్వాల్సిన సమయం వచ్చింది అందుకే కూల్గా సినిమాలు చేస్తున్నట్లు చాలా సందర్భాల్లో చెప్పుకొచ్చింది. ఇటీవలే చీరల వ్యాపారంలోకి కూడా ఎంట్రీ ఇచ్చింది. ఆబి జినెస్ ని సక్సెస్ చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. నటిగా తనకున్న ఇమేజ్ ని బిజినెస్ పరంగా వినియోగించుకుంటుంది. తాజాగా జీవిత ప్రయాణానికి సంబంధించి స్నేహ కొన్ని విలువైన విషయాలు పంచుకుంది. ఆవేంటో ఆమె మాటల్లోనే... 'పొజెసివ్ నెస్ ఉండాలి. కానీ అది అతిగా ఉండకూడదు. అది ఎక్కువైతే నమ్మకాన్ని కోల్పోతాం. బయటకు ఎందుకు వెళ్తున్నావ్? వెళ్లి ఏం చేస్తావ్? వంటి ప్రశ్నలు తలెత్తకూడదు. అవతలి వాళ్లు సరిగ్గా అర్థం చేసుకుంటే ఇలాంటి ప్రశ్నలు రావు. లేకపోతే అన్నీ సమస్యలే. మనల్ని అడగక ముందే ఏం చేయబోతున్నామనేది ముందుగానే చెప్పేస్తే ఎలాంటి ఇబ్బందులుండవు. దాన్ని ఎవరైనా బాధ్యతగా భావించాలి. వెళ్లాక సమయం ఉంటే భాగస్వామికి ఫోన్ చేసి చేరుకున్నావా? లేదా? భోజనం చేసావా? లాంటి విషయాలు అడగాలి. ఇలాంటివే ప్రేమను..నమ్మకాన్ని పెంచుతాయి. పెళ్లైన కొత్తలో నేను కూడా పొజెసివ్ గా ఉండేదాన్ని. అలా అని నమ్మకం లేక కాదు. నాకంటే ముందు ఓ అమ్మాయిని ప్రసన్న ప్రేమించాడు. వారికి బ్రేకప్ అయింది. అందువల్ల నాకెలాంటి సమస్య రాలేదు. ఎందుకంటే ఆ బ్రేకప్ జరిగింది కాబట్టే ప్రసన్నానాకు భర్త అయ్యాడు. లేకపోతే అలా జరిగేది కాదు. ఆ విషయంలో నేను లక్కీగా భావిస్తాను. అదే సమయంలో నాకు మరో సమస్య వచ్చి పడింది. ఎంతో మానసిక ఒత్తిడికి గురయ్యాను. కానీ అప్పుడే తమిళనాడు ఫిలిం అవార్డు అందుకున్నాను. దీంతో ఆ ఒత్తిడి నుంచి బయటపడగలిగాను' అని అన్నారు. ఇటీవలి కాలంలో విడాకుల కేసులు ఎక్కువవుతోన్న నేపథ్యంలో స్నేహ చేసిన ఈ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఫ్యామిలీ కౌన్సిలింగ్ లోనూ నిపుణులు ఇవే విషయాలు చెబుతున్నారు




## '90s' టీమ్ నుంచి వస్తున్న
# మరో సిరీస్ 'టీచర్'

ఈ మధ్య కాలంలో ఫ్యామిలీ ఆడియన్స్ కి బాగా కనెక్ట్ అయిన వెబ్ సిరీస్ లలో '90s - ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' ఒకటిగా కనిస్తుంది. శివాజీ - వాసుకి ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ ను నవీన్ మేడారం నిర్మించగా, ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించాడు. వాస్తవానికి దగ్గరగా వెళుతూనే ఒక వైపున నవ్విస్తూ .. మరో వైపున ఎమోషనల్ గా కనెక్ట్ అయిన సిరీస్ ఇది.

ఇప్పుడు ఇదే టీమ్ నుంచి మరో సిరీస్ రావడానికి రెడీ అవుతోంది .. ఆ సిరీస్ పేరే 'టీచర్'. ఈ కథ కూడా తెలంగాణ నేపథ్యంలోనే నడుస్తుంది. తెలంగాణలోని 'అంకాపూర్' అనే గ్రామంలో ముగ్గురు డల్ స్టూడెంట్స్ ఉంటారు. మిగతా విషయాల్లో మాత్రం ఈ ముగ్గురిని అదుపు చేయడం చాలా కష్టమైన విషయం. అలాంటి ఈ ముగ్గురు స్టూడెంట్స్ కి ఒక టీచర్ తారసపడుతుంది.

అప్పటి నుంచి ఈ ముగ్గురు స్టూడెంట్స్ లైఫ్ లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయి? అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? అనేది మిగతా కథ. స్టూడెంట్స్ గా నిఖిల్ .. నిత్యశ్రీ .. సిద్ధార్థ్ కనిపించనుండగా, టీచర్ పాత్రను 'కలర్స్' స్వాతి పోషించింది. ప్రేమ .. అభిమానం .. సరదాలు .. భావోద్వేగాలతో నడిచే ఈ సిరీస్, త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.




# మిస్టరీ కోణంలో 'కిష్కిందపురి'

**సెట్స్ పైకి బెల్లంకొండ శ్రీనివాస్ 11వ సినిమా**
**విలేజ్ నేపథ్యంలో నడిచే కథాకథనాలు**
**'కిష్కిందపురి' టైటిల్ ను ఖరారు చేసే ఛాన్స్**
**డిఫరెంట్ జోనర్ ను టచ్ చేస్తున్న డైరెక్టర్**

బెల్లంకొండ శ్రీనివాస్ ఇక్కడ మంచి ఫామ్ లో దూసుకుపోతుండేవాడు. ఆ సమయంలో ఆయనకి బాలీవుడ్ సినిమా చేయాలనే ఆలోచన వచ్చింది. 'చత్రపతి'ని హిందీలో చేయడానికి ఎక్కువ సమయాన్ని తీసుకున్నాడు. కానీ ఫలితం లేకుండా పోయింది. అక్కడ ఆ సినిమా హిట్ కాకపోగా ఇక్కడి ఆడియన్స్ తో గ్యాప్ వచ్చేసింది. దాంతో ఇక పుంజుకునే పనిలో ఉన్నాడతను. ఆల్రెడీ ఆయన సినిమా 'టైసన్ నాయుడు' సినిమా సెట్స్ పై ఉంది. ఈ నేపథ్యంలోనే ఆయన 11వ సినిమాకి సంబంధించిన పనులు మొదలయ్యాయి. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమాకి కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. అజనీశ్ లోక్ నాథ్ ఈ సినిమాకి సంగీతాన్ని సమకూర్చుతున్నాడు. భారీతనమే ప్రధానంగా ఈ సినిమా నిర్మాణం జరగనుంది. ఈ సినిమాకి 'కిష్కిందపురి' అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారట. దాదాపు ఇదే టైటిల్ ను ఖరారు చేయవచ్చనే ఒక టాక్ వినిపిస్తోంది. మిస్టరీ .. హారర్ ను కలుపుకుని ఈ కథ 'కిష్కిందపురి' అనే విలేజ్ లో నడుస్తుంది. టైటిల్ కి తగినట్టుగానే ఈ కథలో కోతుల ప్రమేయం ఉంటుంది. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర విషయాలు తెలియనున్నాయి.




## మన సీత కి వరల్డ్ వైడ్ అరుదైన గౌరవం



టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఆర్ఆర్ఆర్ సినిమా లో రామ్ చరణ్ కు జోడీగా సీత పాత్రలో నటించిన ఆలియా భట్ కు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. బాలీవుడ్ లో టాప్ హీరోయిన్స్ జాబితాలో ఆలియా భట్ పేరు ముందు వరుసలో ఉంటుంది అనడంలో సందేహం లేదు. దేశ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా ఆలియా భట్ కి మంచి ఆధరణ ఉందని తాజాగా వెల్లడి అయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖల జాబితాను ప్రముఖ మ్యాగజైన్ టైమ్స్ వారు వెల్లడించారు. టైమ్స్ 100 జాబితాలో ఆలియా భట్ నిలిచింది. ఇండియాకు చెందిన మరికొందరు కూడా ఈ జాబితాలో నిలిచారు. కానీ సినిమా ఇండస్ట్రీకి చెందిన వారు మాత్రం ఆలియా తప్ప మరెవ్వరూ లేరు. ఆలియా కు మాత్రమే ఈ అరుదైన ఘనత దక్కింది. బాలీవుడ్ నటికి ఇంతటి గౌరవం దక్కడం అరుదైన విషయంగా విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. హాలీవుడ్ లో గత ఏడాది హార్ట్ ఆఫ్ స్టోన్ అనే సినిమాతో మెరిసింది. అక్కడ ప్రేక్షకులను మెప్పించడం ద్వారా కూడా ఇప్పుడు టైమ్స్ 100 జాబితాలో ఆలియా చోటు దక్కించుకుని ఉంటుంది అంటూ విశ్లేషకులు మరియు నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్ లో లేడీ ఓరియంటెడ్ సినిమాలతో పాటు కమర్షియల్ సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. పెళ్లి మరియు బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా ఆలియా ఇంతగా బిజీగా ఉండటం మరియు ఇలాంటి అరుదైన గౌరవాలు దక్కించుకోవడం ఆమెకే చెల్లిందని ఫ్యాన్స్ అంటున్నారు.

## విలన్ గా మరోసారి విజృంభించనున్న జగపతిబాబు!

జగపతిబాబుకి విలన్ గా ఇప్పుడున్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పని లేదు. ఆ మధ్య చాలా పవర్ఫుల్ పాత్రలను పోషిస్తూ వచ్చిన జగపతిబాబుకి ఇటీవల కాలంలో అలాంటి రోల్స్ పడలేదనే చెప్పాలి. జగపతిబాబు చాలా డిఫరెంట్ గా కనిపించాడని ఆడియన్స్ చెప్పుకోక చాలానే రోజులైంది. అలాంటి జగపతిబాబు త్వరలోనే అభిమానుల ముచ్చట తీర్చనున్నాడని అంటున్నారు. జగపతిబాబు కూడా కొంతకాలంగా పవర్ఫుల్ రోల్ కోసం వెయిట్ చేస్తూ ఉన్నాడు. అలాంటి పాత్ర ఆయనకి హరీశ్ శంకర్ ఇచ్చాడని అంటున్నారు. హరీశ్ శంకర్ - రవితేజ కాంబినేషన్లో ఒక సినిమా రూపొందుతోంది. ఈ సినిమాకి 'మిస్టర్ బచ్చన్' అనే టైటిల్ ను ఇటీవలే ఖరారు చేశారు. ప్రస్తుతం షూటింగు దశలో ఉంది. త్వరలోనే హైదరాబాద్ లో మరో షెడ్యూల్ ను మొదలెట్టనున్నారు. ఈ సినిమాలో జగపతిబాబు పాత్ర చాలా వైవిధ్యభరితంగా ఉంటుందని అంటున్నారు. ఆయన పాత్ర చాలా స్టైలిష్ గా .. పవర్ఫుల్ గా ఉంటుందని చెబుతున్నారు. భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్న ఈ సినిమాకి విశ్వప్రసాద్ - వివేక్ కూచిభొట్ల నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతాన్ని సమకూర్చుతున్న ఈ సినిమా, ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613